
సాక్షి
చిత్తూరు
బుధవారం । 18 । జూన్ । 2025



ధరలు వి'ఫలం'!

జిల్లాలో మామిడి ధరలు భారీగా పతనమయ్యాయి. ర్యాంపుల్లో కిలో రూ.3 లెక్కన పలుకుతోంది. - 8లో



గుట్టలనే మింగేస్తున్నారు

పాలసముద్రం మండలంలో గుట్టలనే మింగేస్తున్నారు. ఎర్రమట్టి కొల్లగొట్టి తరలించేస్తున్నారు. - 8లో



రాష్ట్రాల మధ్య వివాదాల పురి

తోతాపురి మూడు రాష్ట్రాల మధ్య వివాదాలకు ఆజ్యం పోసింది. ఆయా రాష్ట్రాల నుంచి మామిడి దిగుమతి కాకుండా చేస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

9న ఆశావర్కర్ల సమ్మె

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 9వ తేదీన సమ్మెకు దిగుతున్నట్లు ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణిని కలిసి సమ్మె నోటీసును అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ఆశవర్కర్లకు కనీస వేతనం అమలు చేయాని, సమస్యలపై స్పందించి పరిష్కరించేలా చూడాలన్నారు. ఆశా వర్కర్లకు అదనపు పనులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిరసనలకు అనుమతి తప్పనిసరి

చిత్తూరు అర్బన్: బహిరంగ ప్రదేశాల్లో నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టాలంటే తప్పనిసరిగా డీఎస్పీ స్థాయి అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. శాంతియుత ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించేప్పుడు ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు సంబంధిత వ్యక్తులు పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. డీఎస్పీకి రాత పూర్వకంగా దరఖాస్తు చేసుకుంటే, ఆయన పరిస్థితిని సమీక్షించి అనుమతలిస్తేనే కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు బాబోయ్!



గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: నివాసాలకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దని విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి స్థానిక గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చైతన్య మాట్లాడారు. ఇళ్లకు అదానీ స్మార్ట్ మీటర్ల బిగింపును రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఈ విధానంతో భవిష్యత్‌లో పలు ఇబ్బందులు రావడం ఖాయమన్నారు. ఇందులో బిల్లులు కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. జవాబుదారీ తనం కూడా ఉండదన్నారు. వీటిని దశలవారీగా ప్రీపెయిడ్ మీటర్లకు మారుస్తారన్నారు. అప్పుడు ముందుగానే వాటికి రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రాత్రుల్లో కరెంటు పోతే రీచార్జ్ చేస్తేగానీ విద్యుత్ సరఫరా కాదన్నారు. నాయకులు సురేంద్రనాథ్, శ్రీనివాసమూర్తి, సౌకత్, మునస్వామి, రషీద్, సురేంద్రనాథ్, రోజా, కోమల, విజయగౌరి, రవి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీలో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురికి రాష్ట్ర అనుబంధ విభాగాల్లో చోటు కల్పిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం వివరాలు వెల్లడించింది. నగరి నియోజకవర్గానికి చెందిన చిరంజీవిని రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శిగా, పలమనేరు నియోజకవర్గానికి చెందిన నాగరాజును రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, కుప్పం, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు చెందిన రాజచంద్రశేఖర్‌గౌండర్, వెంకటరమణయ్య, జయరామయ్యను రాష్ట్ర కల్చరల్ వింగ్ కార్యదర్శులుగా నియమించినట్టు పేర్కొంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 84,681 మంది స్వామి వారిని దర్శించుకోగా 35,261 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.43 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.



● గంగాధరనెల్లూరు మండలం, నెల్లేపల్లి పంచాయతీ, కొత్తూరు గ్రామంలో ఉన్న పాఠశాలను కూటమి ప్రభుత్వం సమీపంలోని నెల్లేపల్లి మోడల్ ప్రాథమిక పాఠశాలలోకి విలీనం చేసింది. చాలా దూరంలో ఉన్న ఈ పాఠశాలకు మా పిల్లల్ని పంపాలంటే కష్టంగా ఉంది. కూటమి వింత నిర్ణయం వల్ల పిల్లల కాళ్లకు బొబ్బలు వస్తున్నాయి.



● మాది గంగాధరనెల్లూరు మండలం, అగ్రహారం గ్రామం. మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల పిల్లలను కే.వీ.పురం పాఠశాలలో విలీనం చేశారు. దీని వల్ల 40 మంది విద్యార్థులు దూర ప్రాంతంలో ఉన్న కేవీ పురానికి వెళ్లాల్సి వస్తోంది. పాఠశాలను మార్చకూడదని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో మూడు సార్లు నిర్ణయం తీసుకుని ఎంతవోకు ఇచ్చినా ఫలితం లేకపోయింది.

● మాది చిత్తూరు రూరల్ మండలం, అనంతాపురం గ్రామం. మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను 16 కి.మీ దూరంలో ఉన్న బీఎస్ఆర్.పేట గ్రామంలోని పాఠశాలలో విలీనం చేశారు. బీఎస్ఆర్ పేటకు వెళ్లాలంటే నాలుగు చెరువులు దారిలో ఉన్నాయి. చిత్తూరు–తిరుత్తణి హైవే ఉంది. ఇలాంటి ప్రమాదపు దారుల్లో పిల్లల్ని ఎలా పంపాలి.





● మాది వెదురుకుప్పం మండలం, యనమల మంద గ్రామం. మా గ్రామంలో దాదాపు 520 కుటుంబాలు ఉన్నాయి. 50 మంది పిల్లలు స్థానికంగా ఉన్న పాఠశాలలో చదువుతున్నారు. ఇప్పుడు పాఠశాలను దూర ప్రాంతంలో ఉన్న మరో పాఠశాలలో విలీనం చేశారు. విలీనం వల్ల మా పిల్లలు నిర్మానుష్యమైన అటవీ ప్రాంతంలో వెళ్లాల్సి వస్తోంది. ఇది న్యాయమేనా?.

'ఈ ప్రభుత్వం(గత వైఎస్సార్‌సీపీ) బడులను కూడా వదల్లేదు. ఊర్లోనే చిన్న పిల్లలు చదువుకోవడం ఇష్టం లేదు. అందుకే కిలోమీటర్ల దూరంలోని పాఠశాలల్లో విలీనం చేస్తున్నారు. అంతదూరం పిల్లలు ఎలావెళ్తారో కూడా ఆలోచించడం లేదు. అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విలీన ప్రక్రియకు ఫుల్‌స్టాప్ పెడుతుంది. ఎక్కడ బడి ఉంటే అక్కడే పిల్లలు చదువుకునేలా అవకాశం కల్పిస్తుంది' అంటూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్ ఊదరగొట్టారు. కానీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రభుత్వ బడులకు ఉరివేశారు. తమ సొంత గ్రామాల్లోనే పేద పిల్లలు చదువుకుంటున్న బడులను సుదూర ప్రాంతాల్లోకి విలీనం చేస్తున్నారు. కిలోమీటర్ల మేర పిల్లలు నడిచి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. తమ పిల్లల బాధలు తీర్చాలంటూ తల్లిదండ్రులు ఆందోళన బాట పడుతున్నారు.

బడికి ఉరి!



విలీనం పేరుతో కూటమి నాటకాలు

- ఆందోళనలో తల్లిదండ్రులు
- నష్టపోతున్న పేద పిల్లలు
- సుదూర ప్రాంతాలకు పంపించలేక ఆపసోపాలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- చోద్యం చూస్తున్న కూటమి నేతలు



విలీనం చేసిన ప్రభుత్వ బడిని కొనసాగించాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న జీడీనెల్లూరు మండలం, కొత్తూరు గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వ నిర్ణయాలు పేద విద్యార్థులకు గుదిబండగా మారుతున్నాయి. గ్రామంలోనే చదువుకోవచ్చన్న వారి ఆశలు అడియాశలవుతున్నాయి. విలీనం పేరుతో వేధింపులకు దిగడం.. సుదూర ప్రాంతాలకు తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే మోడల్ ప్రైమరీ పాఠశాలలు, ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వ బడులను విలీనం చేయడం విడ్డూరంగా ఉందని పలువురు మండిపడుతున్నారు. పాఠశాలలు యథావిధిగా తమ గ్రామాల్లోనే కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. వినతిపత్రాలు అందించి తమ పిల్లల కష్టాలు చెప్పుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు.

ప్రభుత్వ బడులపై కూటమి కక్ష

కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే జిల్లాలోని సర్కారు బడులపై కక్షగట్టింది. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయాల్సింది పోయి విలీనం పేరుతో కత్తి దూసింది. అసంబద్ధత నిర్ణయాలు తీసుకుని పేద విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోంది. జిల్లాలోని ప్రతి మండలంలో మోడల్ ప్రైమరీ పాఠశాలలను నెలకొల్పడంతో చాలా గ్రామాల్లో ప్రభుత్వ బడులు విలీనం అయ్యాయి. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను దూరాభారం పంపించలేక అష్టకష్టాలు పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొందరు పిల్లలను బడికి పంపడం మాన్పిస్తున్నారు. మరికొందరు ప్రయివేటు పాఠశాలలకు పంపుతున్నారు.

బడికి దూరం

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విలీన ప్రక్రియ వల్ల ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేల మంది విద్యార్థులు బడికి దూరం కావాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,436 పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి 64,519, 1 నుంచి 8వ తరగతి 45,800, 6 నుంచి 10వ తరగతి వరకు 30,898 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 60 మంది విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూల్స్ (ఆదర్శ పాఠశాలలు) పేరుతో మార్పు చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల నుంచి ఆఘమేఘాల మీద దొంగ సంతకాలు చేయించుకుని బడులను విలీనం చేశారు. తల్లిదండ్రుల సమ్మతి లేకుండానే తామనుకున్నది నెరవేర్చారు. ప్రస్తుతం బడులు పునఃప్రారంభమయ్యాక తల్లిదండ్రులకు కూటమి చేసిన అసలు విషయం బయటపడింది. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో విలీన ప్రక్రియ చేపట్టి 498 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ను ఏర్పాటు చేశారు. దీంతో వేల మంది విద్యార్థులు బడికి దూరమయ్యారు.

జిల్లాలో 545 ప్రభుత్వ బడులు విలీనం

కూటమి ప్రభుత్వం మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరుతో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 545 ప్రభుత్వ బడులను విలీనం చేసింది. ఆ బడులను దూర ప్రాంతాల్లో విలీనం చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలు చేపడుతున్నారు. విలీనం చేసిన బడులను తిరిగి యథాతథంగా కొనసాగించాలని ధర్నాలకు దిగుతున్నారు. ప్రస్తుతం విలీనం చేసిన 545 బడులను మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరుతో 498 పాఠశాలల్లోకి 3,4,5 తరగతులను విలీనం చేశారు.

జిల్లా సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	మొత్తం విద్యార్థులు
ప్రాథమిక	1,902	64,519
ప్రాథమికోన్నత	204	45,800
ఉన్నత	330	30,898
మొత్తం	2,636	1,41,217

జిల్లాలో విలీనం చేసిన బడుల వివరాలు

నియోజక వర్గం	విలీనం చేసిన బడులు	ఏర్పాటు చేసిన మోడల్ స్కూళ్లు
చిత్తూరు	37	31
జీడీనెల్లూరు	139	54
కుప్పం	44	137
నగరి	16	29
పలమనేరు	83	99
పుంగనూరు	127	78
పూతలపట్టు	99	70
మొత్తం	545	498

పేదలంటే చిన్నచూపు?



ఈ ప్రభుత్వానికి పేదలంటే ఎందుకు అంత చిన్నచూపో అర్థం కావడంలేదు. ఎన్నికలకు ముందు బడులను విలీనం చేయమని మాటిచ్చింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పాఠశాలలను విలీనం చేస్తోంది. మా ఊర్లోనే పాఠశాల ఉండేది. ఇప్పుడేమో దూర ప్రాంతానికి మార్చేశారు. ఇలాంటి దుస్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

– సుఖన్య, విద్యార్థి తల్లి, గంగాధరనెల్లూరు మండలం

మా స్కూల్ మాకే కావాలి



మా గ్రామంలోని స్కూల్ మాకే కావాలి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడెందుకు స్కూళ్లను విలీనం చేస్తున్నారు. మా పిల్లలను కి.మీ దూరం నడిపిస్తే ప్రభుత్వానికి సంతోషమా?. మా అంగీకారం లేకుండానే బడులను మార్చేశారు. మాకు న్యాయం చేసి తీరాల్సిందే. గంగాధరనెల్లూరు మండలం, నెల్లేపల్లి పాఠశాలకు మా పిల్లలను పంపించం.

– చంద్రిక, విద్యార్థి తల్లి, గంగాధరనెల్లూరు మండలం

మాట నిలబెట్టుకోవాలి



బడులను విలీనం చేసేది లేదని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు సారు నిలబెట్టుకోవాలి. కిలోమీటర్ల దూరం మా పిల్లలను ఎలా పంపేది. గతంలో మా ఊర్లోని పాఠశాల చాలా అభివృద్ధి చెందింది. ఇప్పుడేమో విలీనం చేస్తున్నారు. న్యాయం చేయకుంటే ఆందోళన తప్పదు.

– మీనా, విద్యార్థి తల్లి, గంగాధరనెల్లూరు మండలం

ఎవరు బాధ్యులు?



అనంతాపురంలో ఉన్న పాఠశాలను 16 కి.మీ దూరంలో ఉన్న బీఎస్ఆర్ పేటకు మార్చారు. అంతదూరం చిన్నపిల్లలను ఎలా పంపాలి..?. ప్రభుత్వానికి ఆ మాత్రం తెలియదా. జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులు. అనంతాపురం పాఠశాల విలీనం విషయం మాకెవ్వరికీ తెలియకుండానే మార్చేశారు.

– శశికల, విద్యార్థి తల్లి, చిత్తూరు రూరల్ మండలం

చిరు దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి పక్కన ఉన్న చిరుదుకాణంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. తినుబండారాలు తయారు చేసే ఆ చిరుదుకాణంలో గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు చెలరేగాయి. సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బేకరిలోని వస్తువులు కాలిపోవడంతో సుమారు రూ.10 వేల వరకు ఆస్తి నష్టం జరిగింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు.

యోగా దినోత్సవానికి 30 బస్సులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విశాఖపట్నంలో ఈనెల 21వ తేదీన జరిగే యోగ దినోత్సవానికి జిల్లా నుంచి 30 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. ఇందులో చిత్తూరు టూ డిపో నుంచి 15 బస్సులు, వన్‌డిపో నుంచి 3, కుప్పం నుంచి 10, పలమనేరు నుంచి 2 బస్సులు ఉన్నాయి. ఇవన్నీ కూడా బెంగళూరు, వేలూరు, తిరువణ్ణామలై, ఇతరాత్ర ప్రాంతాలకు తిరిగే ఎక్స్‌ప్రెస్ బస్సులు. వీటిని యోగా దినోత్సవానికి కేటాయిస్తే ప్రయాణికులు ఇబ్బందులు తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పీఎం శ్రీకి షాక్

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలను విస్మరిస్తున్న టీడీపీ

- తల్లికి వందనం ఇవ్వకుండా ఎగనామం
- రగిలిపోతున్న బీజేపీ నేతలు
- కేవీఎస్ విద్యార్థులు



చిత్తూరు కలెక్టరేట్/ తిరుపతి ఎడ్యుకేషన్ : కూటమి ప్రభుత్వం బీజేపీకి షాక్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తింపజేయకుండా నాన్చుతోంది. ఎన్నికల ముందు మేనిఫెస్టో ప్రకటించే సమయంలో బీజేపీ మేనిఫెస్టోకు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరించింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలకు పథకాలు ఇవ్వకుండా మినహాయించింది. ఫలితంగా వేలాది మంది పేద విద్యార్థులు అర్హత ఉన్నప్పటికీ తల్లికి వందనం పథకం కింద లబ్ధి పొందలేకపోయారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నాయకత్వం ఈ నెల 21న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పీఎంకు ఈ మెయిల్స్ పంపిస్తున్నారు. అయితే పీఎం కార్యాలయం నుంచి విద్యార్థులకు, ఆ పాఠశాలలకు ఇంకా ఎలాంటి సమాధానం రాలేదు. ఈ సమాచారం అందుకున్న కూటమి ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులను, తల్లిదండ్రులను సచివాలయాల్లో ఫిర్యాదు చేసుకోవాలని సూచించింది. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం తల్లికి వందనం దరఖాస్తులను ఆయా బడుల్లోనే చేసుకోవాలని వెనక్కి పంపించేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలలకు సమాచారం చేరవేశారు. ఈ సమయంలో ఈ పథకం వర్తింపుపై బీజేపీ శ్రేణులే చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేల మందికి నష్టం

తిరుపతి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం పరిధిలో పీఎం శ్రీ పాఠశాలలు 2, రేణిగుంటలో 1, ఏర్పేడు ఐఐటీలో 1, వెంకటగిరిలో 1 మొత్తం 5 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 30 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఒక్క విద్యార్థికి సైతం తల్లికి వందనం నగదు ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది.

లోలోపలే కక్ష సాధింపులు

పైకేమో కూటమి సర్కారు అంటూ ఆర్భాటాలు...లోపలేమో కక్ష సాధింపులు. తాజాగా విడుదలైన తల్లికి వందనం పథకంలో సెంట్రల్ పరిధిలో నిర్వహిస్తున్న పాఠశాలల విద్యార్థులకు తల్లికి వందనం పథకం మంజూరు చేయని దుస్థితి. గత వైఎస్సార్‌సీపీ సర్కారులో ఎలాంటి తారతమ్యం లేకుండా అన్ని యాజమాన్యాల పిల్లలకు అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు. ఇప్పుడు తమతో పాటే ఉన్న బీజేపీ ప్రభుత్వం పట్ల టీడీపీ కక్ష సాధింపు ధోరణి చేస్తోందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తిరుపతి జిల్లా వ్యాప్తంగా పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఈ స్కూల్స్ లో వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఒక్క విద్యార్థికి కూడా తల్లికి వందనం మంజూరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సందర్భంగా టీడీపీ రూపొందించిన మేనిఫెస్టోను బీజేపీ విస్మరించడంతోనే ఇలా కక్షసాధింపు చర్యలకు దిగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మామిడి రైతుకు కూటమి శఠగోపం




మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం శఠగోపం పెట్టేసిందని, మద్దతు ధర కల్పించడంలో విఫలమైందని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ధ్వజమెత్తారు. మంగళవారం ఉడమలకృత్తి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మామిడి రైతులకు ఎక్కడా సంతోషం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పరిశ్రమలు ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. గత జగనన్న ప్రభుత్వంలో కిలో మామిడి రూ.30 వరకు చెల్లించినట్లు ఆయన గు ర్తుచేశారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం కిలో రూ.4కు పరిమితం చేయడం సమంజసం కాదన్నారు. పరిశ్రమలు ఇచ్చే టోకన్లలోనూ రాజకీయాలా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరిని రైతులు ప్రశ్నిస్తే వారిపై కేసులు నమోదు చేసి వేధించడం పనిగా పెట్టుకున్నట్టు విమర్శించారు. మామిడి రైతుల నుంచి దళారులు అతి తక్కువ ధరలకు పంటను కొనుగోలు చేస్తుంటే అధికారులు, పాలకులు ఏం చేస్తున్నారని నిలదీశారు. వెంటనే మామిడి రైతు కన్నీళ్లు తుడాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆరోపించారు. పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాలికలు, మహిళలపై అత్యాచారాలు, మానభంగాలు, దౌర్జన్యాలు, దాడులు పెచ్చుమీరుతున్నాయన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు ఇలాక కుప్పం నియోజకవర్గంలో భర్త చేసిన అప్పు చెల్లించలేదని భార్య శిరీషను చెట్టుకు కట్టి దాడి చేసిన పచ్చనేతపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అనంతపురం జిల్లాలో పరిటాల సునీత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో దళిత బాలికపై 14 మంది టీడీపీ కామాంధులు అత్యాచారానికి ఒడిగడితే వారిపై ఎలాంటి చర్యలు లేవన్నారు.

తోతాపురి కిలో రూ.6



జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తోతాపురి కిలో రూ.6కు తగ్గకుండా చూస్తామని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ జి.విద్యాధరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ఆమె తోతాపురి మామిడి కాయల కొనుగోలు ప్రక్రియపై మీడియాతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 98 వేల ఎకరాలలో దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి పండిస్తున్నారని చెప్పారు. జిల్లాలో 35 ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా అందులో 27 పరిశ్రమలు మాత్రమే మామిడి పండ్ల ప్రాసెసింగ్ చేస్తున్నాయన్నారు. గుజ్జు పరిశ్రమల ద్వారా రోజూ దాదాపు 7 వేల మెట్రిక్ టన్నుల మామిడి ప్రాసెసింగ్ జరుగుతోందన్నారు. మామిడి రైతులు నష్టపోకూడనే ఉద్దేశంతో తోతాపురి మామిడి కిలో రూ.12గా మద్దతు ధర నిర్ణయిస్తూ జూన్ 6న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. ఇందులో గుజ్జు పరిశ్రమలు రూ.8 చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం అధనంగా రూ.4 మద్దతు ధరను రైతుల ఖాతాలకు నేరుగా జమచేస్తుందన్నారు. 38 ర్యాంపులు, 2 మండీల వద్ద అమ్ముకునే రైతులకు కూడా ప్రభుత్వం రూ.4 మద్దతు ధరను అందిస్తుందన్నారు. మామిడి కాయల కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రతి ప్రాసెసింగ్ యూనిట్, మండీలు, ర్యాంప్ వద్ద హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఒక వీఆర్వోతో కూడిన టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని మామిడి రైతులకు సమస్యలుంటే 08572-242777, 9491077325 హెల్ప్‌లైన్‌లోకు సంప్రదించాలని కోరారు. గత ఎనిమిది రోజుల నుంచి తోతాపూరి మామిడికాయలు 38 వేల టన్నులు ఫ్యాక్టరీలకు సరఫరా చేసినట్లు ఆమె వివరించారు.

ధరలు విఫలం!


టోకన్ల కోసం గుడిపాల మండలంలోని ఫుడ్ ఇనోసిస్ ఫ్యాక్టరీ ఎదుట గుమికూడిన రైతులు

జిల్లాలో మామిడి ధర పతనమవుతోంది. తోతాపురి ధర దిగజారుతోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మూలనపడింది. ర్యాంపుల్లోనే కేజీ రూ.3కే అమ్ముడవుతోంది. దీనికితోడు దళారీ వ్యవస్థ అడ్డగోలుగా తయారైంది. తమిళనాడు కాయలను కొని.. ప్రభుత్వ ప్రోత్సాహక నిధి రూ.4 కోసం దందా సాగిస్తోంది. ఈ ప్రభావం జిల్లా రైతులపై పడుతోంది. ఫ్యాక్టరీల వద్ద రైతాంగం పడిగాపులు కాస్తోంది. టోకన్ల కోసం తొక్కిసలాట, తోపులాటలతో సొమ్మసిల్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

జిల్లాలో దిగజారిన మామిడి ధర

- ర్యాంపుల్లో కేజీ రూ.3లే
- ఫ్యాక్టరీల వద్ద రైతుల పడిగాపులు
- టోకన్ల కోసం గుడిపాలలో తొక్కిసలాట
- సొమ్మసిల్లిన రైతులు
- అడ్డగోలుగా దళారీ వ్యవస్థ
- పట్టనట్టు వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం

కాణిపాకం: జిల్లాలో తోతాపురి అవస్థలు తారస్థాయికి చేరాయి. అధిక దిగుబడిని సాకుగా చూపి అందినకాడికి దోచుకునేందుకు ర్యాంపులు తహతహలాడుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 23కి పైగా ర్యాంపులు తెరపైకి వచ్చాయి. వీటిలో కొన్ని రిజిస్ట్రేషన్ చేసుకుంటే.. మరికొన్నింటికి రిజిస్ట్రేషన్లు లేవని అధికారులే చెబుతున్నారు. కోతలు పెరిగే కొద్దీ ర్యాంపులు తోతాపురి కేజీ రూ.4 నుంచి రూ.3కు తగ్గిపోయింది. జిల్లా కేంద్రంలో అది కూడా కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఓ ర్యాంపులో కేజీ రూ.3కే కొనుగోలు చేస్తున్నారు. అలాగే చిత్తూరు రూరల్ మండలం, బంగారుపాళ్యం, పలమనేరు, పులిచెర్ల, జీడీనెల్లూరు, పెనుమూరు తదితర ప్రాంతాల్లోని ర్యాంపుల్లో కేజీ రూ.3కే ఫిక్స్ అయ్యారు. ర్యాంపుల్లో ఈ రకమైన దోపిడీ అధికమవుతున్నా సంబంధిత అధికారులుగానీ, కూటమి నేతలు గానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

దళారుల దోపిడీ ఇలా..!

మామిడి పంట విషయంలో తమిళనాడు రాష్ట్రం చేతులెత్తేసింది. ఈ కారణంగా అక్కడ మామిడి ధరలు పూర్తిగా క్షీణించాయి. ప్రస్తుతం అక్కడి రైతులు తోతాపురి కేజీ.3కి విక్రయిస్తున్నారు. అయితే ఈ ధరలు దళారులకు కలిసొస్తోంది. వీరు గ్యాంగ్‌గా ఏర్పడి ఫ్యాక్టరీ నిర్వాహకులతో కుమ్మక్కై తమిళనాడు కాయలను రూ.3కు కొనుగోలు చేసి జిల్లాలోని ఫ్యాక్టరీలకు తీసుకొచ్చేస్తున్నారు. తమిళనాడు కాయలను ఇక్కడ కేజీ రూ.4, రూ.5కు విక్రయించి దళారులు దండుకునే పనిలో పడ్డారు.

ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహక నిధి రూ4ను దోచుకోవడానికి కొత్తదారిని ఎంచుకున్నారు. దళారులకు మామిడి పంట లేకున్నా.. రూ.4 కోసం కొత్త దోపిడీని మొదలుపెట్టారు. ఏదో ఒక పట్టా పాసుపుస్తకాన్ని చూపిస్తున్నారు. ఇలా గుడిపాల, యాదమరి, బంగారుపాళ్యం, చిత్తూరు, జీడీ నెల్లూరు, పాలసముద్రం, ఎస్‌ఆర్ పురం తదితర మండల సరిహద్దు ప్రాంతాల్లో దళారులు రాజ్యమేలుతున్నారు.

సమయం లేదు మిత్రమా

మేలో సంవృద్ధిగా వర్షాలు కురిశాయి. ఈ వర్షానికి మామిడి పంట పక్వానికి వచ్చింది. రెండు వారాల్లో కోతలు కోయకుంటే ..మామిడికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే తోటలోని కాయలు రాలిపోతున్నాయి. టోకన్లు జూలై నెలాఖరు వరకు ఇస్తే.. అంతవరకు చెట్లోని కాయలు ఏమైపోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు

రైతులకు గుజ్జు పరిశ్రమల వద్ద అవస్థలు తప్పడం లేదు. జీడీనెల్లూరు మండలం ఎట్టేరి సమీపంలోని ఫ్యాక్టరీ వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. టోకన్లు తీసుకున్న రైతులు మామిడి పంటను కోతలు కోసి విక్రయానికి తెచ్చుకున్నారు. వీరి రాకతో కిలో మీటరు మేర ట్రాక్టర్లు, లారీలు క్యూకట్టాయి. ఇలా రెండు, మూడు రోజులు కాయలు ట్రాక్టర్లలోనే ఉండిపోవడంతో కాయలు నల్లగా మారిపోతున్నాయి. గుడిపాల మండలంలోని ఫుడ్ ఇనోసిస్ ఫ్యాక్టరీలో సోమవారం రాత్రి 20 ట్రాక్టర్లను ఎలాంటి అనుమతి లేకుండా ఫ్యాక్టరీ వాళ్లను బెదిరించి స్థానిక కూటమి నాయకులు బలవంతంగా ఫ్యాక్టరీకి అంటగట్టారని నిర్వాహకులు వాపోయారు. వారి వల్ల ఇక్కడున్న వందలాది వాహనాలు ఇబ్బంది పడాల్సి వచ్చిందని అసంతృప్తిని వ్యక్తం చేశారు.

మా బతుకులు దారుణం



మామిడి రైతుల బతుకులు దారుణంగా మారాయి. ఎప్పుడూ లేనంతగా రైతు ఈసారి అవస్థలు పడుతున్నాడు. మామిడి కాయలు అమ్ముకోవడానికి ఇలా క్యూలో పడి నలిగిపోతున్నాము. కేవలం టోకన్ల కోసమే ఈ పరిస్థితి ఉంటే.. వచ్చిన కాయలు అక్కడికక్కడికి అలానే నిలిచిపోయాయి. టోకన్లు జూలై నెలాఖరు వరకు ఇస్తున్నారు. అంత వరకు చెట్లల్లో కాయలు ఉంటాయా..? ప్రభుత్వమే ఆలోచించాలి. **–జ్యోతీశ్వర్‌రెడ్డి, బంగారుపాళ్యం**




తోపులాటలో కింద పడిపోయిన మహిళ, స్పృహ తప్పి పడిపోయిన రైతు, టోకన్ల కోసం చెట్టు ఎక్కి చూస్తున్న రైతు

తొక్కిసలాట.. తోపులాట

గుడిపాల మండలంలోని ఫుడ్ ఇనోసిస్ ఫ్యాక్టరీ వద్దకు రైతులు మంగళవారం టోకన్ల కోసం వేలాది మంది తరలివచ్చారు. చిత్తూరు, గుడిపాల, బంగారుపాళ్యం, జీడీనెల్లూరు, యాదమరి, రాష్ట్ర సరిహద్దులోని తమిళనాడు రైతులు సైతం వేకువజామున 5 గంటలకే ఫ్యాక్టరీ ఎదుట భారీగా క్యూకట్టారు. వచ్చిన రైతులను కట్టడి చేయలేక ఫ్యాక్టరీ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో గుడిపాల పోలీసులు అదనంగా ఎస్టీఎఫ్ సిబ్బందిని రప్పించారు. ఒక్కసారిగా రైతులు ఫ్యాక్టరీలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. టోకన్ల కోసం ముందు వరుసలో నిలవాలని పోటీ పడ్డారు. ఇలా మూడు గంటలపాటు అక్కడ గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో తో పులాట, తొక్కిసలాటలు జరిగాయి. ఓ వ్యక్తి తొ క్కిసలాటలో నలిగిపోయాడు. మరో వ్యక్తి సొమ్మ సిల్లి పడిపోయాడు. ఓ మహిళ కూడా గేటు తీసి టోకన్ల కోసం లోపలికి అనుమతించే క్రమంలో సొమ్మసిల్లింది. పోలీసులు తక్షణం స్పందించాల్సి వచ్చింది.


గేటును తోసుకుంటూ ఫ్యాక్టరీలోకి చొచుకెళ్తున్న మహిళా రైతులు


గుడిపాల వద్ద చిత్తూరు- వేలూరు రోడ్డులో క్యూగట్టిన వాహనాలు


టోకెన్ల కోసం రైతుల నిరీక్షణ

క్లుప్తంగా

గుట్టలనే మింగేస్తున్నారు

పాలసముద్రం: మండలంలోని బాలక్రిష్టాపురం సమీపంలోని గుట్ట నుంచి తమిళనాడు తమిళనాడు రాష్ట్రానికి ఎర్రమట్టి గ్రావెల్ అక్రమంగా తరలిపోతున్నదని గ్రామస్తులు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగానికి తెలిపినా పట్టించుకోవడం లేదు. మండలంలో ప్రజలు, రైతులు చెరువులో మట్టి, ఇంటి పక్కన ఉన్న గుంతలను పూడ్చేందుకు ట్రాక్టర్‌లో మట్టి తీసుకెళ్లుతుంటే మాత్రం రెవెన్యూ అధికారులు ట్రాక్టర్, జేసీబీని సీజ్ చేస్తున్నారు. నెల రోజులుగా టిప్పర్‌లో కొండను తవ్వేస్తుంటే అధికారులు అటువైపు కన్నెత్తి చూసినవారు లేరని రైతులు అంటున్నారు. టిప్పర్లు తమిళనాడువే, పని చేసేవారు కూడా తమిళనాడు వారే. గ్రామస్తులు కొండలోని మట్టిని ఎందుకు తీసుకెళ్లుతున్నారని అడిగితే వారి బెదిరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా గుట్టలోని ఎర్రమట్టి రవాణా అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పుత్తూరు విద్యార్థి ముంబయిలో ఆత్మహత్య

- మంగళవారం పుత్తూరుకు చేరిన మృతదేహం


విలపిస్తున్న తల్లిదండ్రులు (ఇన్‌సెట్‌లో) శ్రీ మధుర్ (ఫైల్)

పుత్తూరు: ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్), ఎన్ఐఈఎల్‌టీ ఫలితాలు రద్దయ్యాయన్న మనస్తాపంతో పుత్తూరుకు చెందిన ఓ విద్యార్థి ముంబయిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన ఎస్ఎస్ జార్జ్, స్వర్ణలత దంపతులకు శ్రీమధుర్, హాషిక ఇద్దరు సంతానం. కుమారుడు శ్రీమధుర్ బీటెక్ పూర్తి చేసి బ్యాంకు కాంపిటీషన్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి ముంబయి ఎస్‌బీఐలో ఐటీ మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించాడు. అయితే ఎన్ఐసీ, ఎన్ఐఈఎల్‌టీ పరీక్షలో సత్తా చాటాడు. అహర్నిశలు శ్రమించి 5వ ర్యాంకు సాధించాడు. అయితే ఆ పరీక్ష ఫలితాలను కొన్ని సాంకేతిక కారణాలతో ఈ ఏడాది రద్దు చేశారు. తన లక్ష్యానికి అవరోధంగా నిలిచినందుకు మనస్తాపానికి గురైన శ్రీమధుర్ శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలియడంతో అతని తల్లిదండ్రులు, తోబుట్టువు కుప్పకూలిపోయారు. తల్లిదండ్రులు ముంబయికి వెళ్లి అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేసి, మృతదేహాన్ని తీసుకొని మంగళవారం పుత్తూరుకు చేరుకున్నారు. సాయంత్రం అశ్రునయనాల మధ్య శ్రీమాధుర్ అంత్యక్రియలు ముగించారు. శ్రీమధుర్ తల్లిదండ్రులు మాట్లాడుతూ తన బిడ్డకు జరిగిన అన్యాయం ఏ బిడ్డకూ జరగకూడదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఐసీ పరీక్షల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అల్లుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న సీఐ

పుత్తూరు: పట్టణ పరిధిలో ని కళ్యాణపురం ఎస్టీ కాలనీలో జరిగిన హత్య కేసులో నిందితుడ్ని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సురేంద్రనాయుడు కథ నం మేరకు.. గ్రామానికి చెందిన చెంచయ్య భార్య ఎస్.నరసమ్మ(53) ఈనెల 4వ తేదీన హత్యకు గురైంది. నరసమ్మ పెద్ద కుమార్తె ఎస్.కళ్యాణిని జీ.మోహన్‌కు ఇచ్చి 2019లో వివాహం చేసింది. పెద్ద అల్లుడు మోహన్ వివాహం అయినప్పటి నుంచి తాగుడికి బానిసై భార్యా బిడ్డలను పట్టించుకునేవాడు కాదు. దీంతో విసుగు చెందిన కళ్యాణి బిడ్డలతో నెల క్రితం పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో ఈనెల 4వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో మోహన్ అత్త ఇంటికి వచ్చి తన భార్యను కాపురానికి పంపా లని నరసమ్మను అడిగాడు. వీరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆవేశానికి లోనైన మోహన్ కర్రతో నరసమ్మ తలపై బలంగా కొట్టాడు. ఆమె కు మార్తె కళ్యాణి తల్లి నరసమ్మను మొదట పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 6వ తేదీన నరసమ్మ మృతి చెందింది. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్న నిందితుడు మోహన్‌ను మంగళవారం తడుకు బస్ స్టాప్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వివాహిత ఆత్మహత్య!


విన్స్‌ప్రియ మృతదేహం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు బీసీ కాలనీకి చెందిన విన్స్‌ప్రియ(34) అనే మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం పలమనేరులో వెలుగులోకి వచ్చింది. స్థానిక సీఐ నరసింహరాజు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలి భర్త పసుపతి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇంట్లో భార్య, ఏడేళ్ల కుమారుడు ఉంటున్నారు. ఇలా ఉండగా డ్యూటీలో భాగంగా విజయవాడలో ఉన్న భర్త సోమవారం రాత్రి భార్యతో మాట్లాడినట్టు సమాచారం. అయితే మంగళవారం పొద్దున నుంచి తన భార్యకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆమె లిఫ్ట్ చేయలేదు. దీంతో తమ ఇంటి పక్కనున్న వారికి చెప్పగా వారు వెళ్లి చూడగా ఉరేసుకుని ఉండడంతో అదే వీధిలో ఉంటున్న మృతురాలి తల్లికి సమాచారం ఇచ్చారు. ఆ సమయంలో మృతురాలి కొడుకు అమ్మమ్మవద్దే ఉన్నాడు. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దించి ఆమె భర్తకు ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు. మరోవైపు స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రాష్ట్రాల మధ్య వివాదాల పురి

జిల్లాలో మామిడి సీజన్ నడుస్తున్న నేపథ్యంలో మామిడి ధరలు నిలకడగా ఉండాలని పొరుగు రాష్ట్రాల నుంచి తోతాపురి కాయలు జిల్లాలోకి రాకుండా అధికార యంత్రాంగం ఇప్పటికే ఆంక్షలను విధించింది. ఇటీవల చిత్తూరుకొచ్చిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సైతం పొరుగు రాష్ట్రాలనుంచి మామిడి ఇక్కడికి రాకూడదని దీనిపై గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం గమనార్హం. ఈ విషయం ఇప్పుడు రాష్ట్రాల మధ్య ఇబ్బందికర పరిస్థితులు తెచ్చేలా ఉంది.

- పొరుగు రాష్ట్రాల తోతాపురిపై కూటమి ఆంక్షలు
- జిల్లా నుంచి కర్ణాటకకు మన పట్టుగూళ్లు
- తమిళనాడుకు ఇక్కడి టమాటాలు వెళుతున్నాయి
- వీటికి ఆ రాష్ట్రాలు అడ్డుకట్ట వేస్తే పరిస్థితేంటి?


చిత్తూరులోని మార్కెట్‌కు వచ్చిన తోతాపురి మామిడి

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి సీజన్‌తో సంబంధం లేకుండా పట్టుగూళ్లు కర్ణాటకలోని పలు మార్కెట్లకు ఇక్కడి రైతులు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. అదే విధంగా టమాటాలు అటు కర్ణాటకలోని కోలారు ఇటు తమిళనాడులోని చెన్నై కోయంబేడు మార్కెట్‌కు నిత్యం వెళుతూనే ఉన్నాయి. ఆ రాష్ట్రాలనుంచి జిల్లాలోని గుజ్జు పరిశ్రమలకు వచ్చే తోతాపురిని మనం అడ్డుకుంటే వారు అదే విధంగా కట్టడి చేస్తే ఇక్కడి టమాటా, పట్టుగూళ్ల రైతుల పరిస్థితి ఏంటనే మాట రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

రాష్ట్రాల మధ్య వివాదాలకు ఆజ్యం?

కర్ణాటక, తమిళనాడునుంచి జిల్లాలోకి మామిడి కాయలు రాకుండా ఆంక్షలు విధించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద రెవెన్యూ యంత్రాంగం కాపాలా కాస్తోంది. దీనికి కారణం జిల్లాలో ఈ దఫా మామిడికి గిట్టుబాటు ధర లేదు. కలెక్టర్ చెప్పినా కిలోకు రూ.8 ఇవ్వలేమని గుజ్జుపరిశ్రమల నిర్వాహకులు మొండికేస్తున్నారు. కనీసం రూ.6 కూ కొనడంలేదు. ఈ నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలనుంచి మామిడి రాకుంటే జిల్లాలోని మామిడికి ధర పెరుగుతుందని అధికారులు ఆంక్షలను పెట్టారు. దీంతో కర్ణాటక ప్రభుత్వం ఘాటుగా స్పందించి మన రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఇది రాష్ట్రాల మధ్య వివాదాలకు దారితీసేలా ఉంది.

మామిడి సీజన్ కొన్నాళ్లే

జిల్లాలో 87వేల ఎకరాల్లో మామిడి తోటలుంటే ఏటా సీజన్‌లో 7లక్షల టన్నుల దిగుబడి వస్తున్నట్టు ఉద్యానశాఖ గణాంకాలు చెబుతున్నాయి. మామిడి సీజన్ ప్రధానంగా మే నుంచి జూలై ఆఖరుదాకా సాగుతుంది. జిల్లాలో సాగయ్యే మామిడిలో తోతాపురి 55శాతం ఉంది. జిల్లాలో 15కుపైగా గుజ్జుపరిశ్రమలున్నాయి. తోతాపురిని పల్ప్ ఫ్యాక్టరీలకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆ రాష్ట్రాలు వీటిపై మెలిక పెడితే...

చిత్తూరు జిల్లానుంచి పట్టుగూళ్లు, టమాటాలను కర్ణాటకలో కొనమని ఆ రాష్ట్రం ఆంక్షలు పెడితే ఇక్కడి రైతుల పరిస్థితేంటనే మాట వినిపిస్తోంది. మరోవైపు తమిళనాడు ప్రభుత్వం ఇక్కడి టమాటాలను వద్దంటే అప్పుడు టమాటా ధరలు మరింత పతనం కావడం తథ్యం. ఇప్పటికే టమాటా ధరలు తగ్గుముఖం పట్టి జిల్లాలోని రైతులు తీవ్రనష్టాల్లో మునిగిపోయారు. ఇదే పరిస్థితి రేపు పట్టుగూళ్ల రైతులకు వస్తే రైతులకు కష్టాలు మొదలై పొరుగు రాష్ట్రాల మధ్య విభేదాలు తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

అదే పట్టుగూళ్లు, టమాటాలకు ఏడాదంతా సీజనే


కర్ణాటకలోని కోలార్‌లో టమాట మార్కెట్

జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో ఎక్కువగా పట్టుగూళ్లు, టమాటా సాగవుతోంది. ప్రస్తుతం 36వేల ఎకరాల్లో 22 వేలమంది రైతులు మల్బరీని సాగుచేస్తున్నారు. ఏటా 1500 టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. ఇక్కడ పండించిన పట్టుగూళ్లను పలమనేరు, కుప్పం, మదనపల్లి పట్టుగూళ్ల విక్రయకేంద్రాలకు తీసుకెళ్లాలి. కానీ ఇక్కడికంటే కర్ణాటకలోని కోలారు, విజయపుర, సిడ్లగట్ట, రామనగరలలో ధర ఎక్కువగా పలుకుతుంది. దీంతో ఇక్కడ ఉత్పత్తయ్యే గూళ్లలో 20 శాతానికి పైగా అక్కడికే చేరుతోంది. ఇక టమాటాలు ఇక్కడి నుంచి కర్ణాటకలోని కోలారు, తమిళనాడులోని కోయంబేడు(చెన్నై) మార్కెట్లకు నిత్యం వందలాది టన్నుల సరుకు వెళుతోంది.

కర్ణాటకలో ధర ఎక్కువ



మేం ఎన్నో ఏళ్లుగా పట్టు గూళ్లను కర్ణాటకలోని మార్కెట్లకు తీసుకెళుతున్నాం. ఎందుకంటే ఇక్కడి మార్కెట్లలో కంటే అక్కడ కేజీపై రూ.40 నుంచి రూ.50 ఎక్కువగా పలుకుతోంది. ఇక్కడ తక్కువ ధరలకు అమ్మి ప్రభుత్వం ఇచ్చే ఇన్‌సెంటీవ్ కంటే అక్కడ అమ్మితే ఎక్కువగా దక్కుతుంది. అందుకే కర్ణాటక మార్కెట్లకు గూళ్లను అమ్ముతున్నాం.
– రెడ్డెప్ప రెడ్డి, పట్టు రైతు, టీఎస్ అగ్రహారం, పలమనేరు

కోలారు మార్కెట్‌లో అమ్మేస్తా



నేను ఏటా సీజన్‌తో సంబంధం లేకుండా పదెకరాల్లో టమాటా సాగుచేస్తా. ఎక్కువ పెట్టుబడి పెట్టి కేవలం హైబ్రిడ్ సీడ్స్‌మాత్రమే ఎంచుకుంటా. ఈ సరుకు ఇక్కడి మార్కెట్‌లో ఆశించిన ధరతో అమ్ముడుపోదు. అందుకు కర్ణాటకలోకి కోలారు టమాటా మార్కెట్‌కు తీ సుకెళ్తాం. అక్కడికి ఇక్కడికి ధరలో వ్యత్యాసం ఉంటుంది.
– గోవిందురెడ్డి, టమాటా రైతు, బేరుపల్లి, పలమనేరు మండలం